సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 27 । జనవరి । 2024



సోమశిలలో 27.101 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 27.101 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 1,850 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	- రూ.64,460
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	-రూ.5,789
3 శాతం జీఎస్టీతో..	- రూ.5,962
నవర (8 గ్రా)	- రూ.47,696

గరిష్టం/కనిష్టం
32.0 /23.1

వాతావరణం

శుక్రవారం గాలిలో తేమ 64 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. శనివారం ఎలాంటి మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించండి



మాట్లాడుతున్న ఆర్‌ఐఓ శ్రీనివాసులు

నెల్లూరు(టౌన్): ఇంటర్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్‌ఐఓ ఎ.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం స్థానిక స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్‌ఐఓ కార్యాలయంలో ఇంటర్ పబ్లిక్ ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈసీ కమిటీని నియమించారు. కమిటీ కన్వీనర్‌గా ఆర్‌ఐఓ శ్రీనివాసులు, సభ్యులుగా వరప్రసాదరావు, దీన్‌దయాళ్, కొండయ్య నియమితులయ్యారు. వృత్తి విద్యా కోర్సులను ఆదినారాయణరావు పర్యవేక్షించనున్నారు. ఈ సందర్భంగా ఆర్‌ఐఓ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల ఏర్పాటు, మౌలిక వసతుల పరిశీలన, నిర్వహణ, సిబ్బంది నియామకాల వంటి అంశాలను కమిటీ పర్యవేక్షిస్తుందని తెలిపారు. ఇంటర్ పరీక్ష ఫీజును ఈ నెల 29వ తేదీ లోపు చెల్లించాలన్నారు. విద్యార్థుల నామినల్ రోల్స్‌కు సంబంధించి ఏమైనా తప్పులు ఉంటే 28వ తేదీ లోపు ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ సరిచేసుకోవచ్చన్నారు. ప్రాక్టికల్స్ పరీక్షలకు సంబంధించి విద్యార్థులను మభ్యపెట్టేలా కొన్ని కళాశాలల యాజమాన్యాలు వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. విద్యార్థులు ప్రాక్టికల్స్, పరీక్షలకు సిద్ధం కావాలని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

జూనియర్ సివిల్ జడ్జిగా అపర్ణ ఎంపిక



నెల్లూరు(లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న వంగా వెంకట అపర్ణ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఏపీ హైకోర్టు గురువారం రాత్రి విడుదల చేసిన తుది ఫలితాల్లో ఈమె ఎంపికయ్యారు. ఈమె 2018లో తిరుపతిలో బీటెక్, అనంతరం పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశారు. 2023లో జరిగిన జేసీజే రాత పరీక్షలు రాసి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్యాయాదవ్, పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

మెగా బంపర్ డ్రా విజేత కె.సతీష్‌కుమార్

- విజేతను ప్రకటించిన ఎంపీ వేమిరెడ్డి



మెగా బంపర్ డ్రా విజేతను ప్రకటిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం): క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండగల నేపథ్యంలో చందన, సీఎంఆర్ ప్రవేశపెట్టిన టాటా టియోగొ కారు డ్రా విజేతను శుక్రవారం రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రకటించారు. నెల్లూరు రాంజీనగర్‌కు చెందిన కె.సతీష్‌బాబు (కూపన్ నంబర్: 90902) యూబీఐ బ్యాంక్ మేనేజర్‌ను విజేతగా ప్రకటించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ చందన, సీఎంఆర్ సంస్థలు వినియోగదారులకు తక్కువ ధరలకే నాణ్యమైన వస్త్రాలు, బంగారు ఆభరణాలు ఇవ్వడమే కాకుండా విలువైన బహుమతులు పండగల సందర్భంగా అందజేయడం సంతోషకరమని తెలిపారు. గత వారం విజేతకు బైక్‌ను, 35 మంది డెయిలీ డ్రా విజేతలకు గ్రైండర్లు, మిక్సీలు, కుక్కర్లు, ఇండక్షన్‌స్టౌలు, నాన్‌స్టిక్‌లను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పి.రూప్‌కుమార్‌యాదవ్, నరసింహారెడ్డి, సీఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు, రాజీ యాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య, శైలేష్, మేనేజర్ వాసు పాల్గొన్నారు.

అనంతసాగరం వాసికి బంగారు పతకం



చల్లా భాస్కర్‌రెడ్డి

సోమశిల: గణతంత్ర దినోత్సవం సందర్భంగా అనంతసాగరం మండలానికి చెందిన చల్లా భాస్కర్‌రెడ్డి సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమి నుంచి శుక్రవారం ఉత్తమ సేవా పురస్కారం, బంగారు పతకాన్ని అందుకున్నారు. ఆ శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రస్తుతం హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న భాస్కర్‌రెడ్డి సేవలను గుర్తించిన కేంద్ర హోం వ్యవహారాల శాఖ గణతంత్ర వేడుకల్లో ఈ పురస్కారాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

అభివృద్ధి పథంలో జిల్లా







జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, బెలూన్లు ఎగురవేస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఏఎస్పీ తదితరులు, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

- అన్ని రంగాల ప్రగతికి కృషి చేస్తున్న ప్రభుత్వం
- కలెక్టర్ ఎం.హరినారాయణన్
- ఘనంగా గణతంత్ర దినోత్సవం
- పలువురికి ఉత్తమ సేవా పురస్కారాలు
- ఆకట్టుకున్న ప్రభుత్వ శకటాలు, స్టాల్స్
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



భరతమాత వేషధారణలో విద్యార్థిని

నెల్లూరు(దర్గామిట్ట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అంబటి రాంబాబు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలతో జిల్లాలో అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని, జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకుసాగుతోందని కలెక్టర్ ఎం.హరినారాయణన్ పేర్కొన్నారు. శుక్రవారం నెల్లూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 75వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనం చేశారు. అనంతరం ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డితో కలిసి పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి తన కార్యాలయంలో, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ జెడ్పీ కార్యాలయంలో, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని జిల్లా కోర్టు ఆవరణలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను, భారత రాజ్యాంగ నిర్మాతల కృషిని వారు కీర్తించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు కృషి చేస్తున్నామని, నవరత్నాల పథకాల అమలులో భాగంగా రైతుభరోసా, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, పింఛన్లు, పేదలందరికీ ఇళ్లు తదితర పథకాలను ప్రతిష్టాత్మకంగా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

రైతుల అభ్యున్నతే ధ్యేయంగా..

జిల్లాలో రైతుల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఈ రబీ సీజన్‌లో ఇప్పటి వరకు 2,55,756 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తుండగా, అందులో ప్రధానంగా 2,04,798 ఎకరాల్లో వరి పంట సాగులో ఉందని తెలిపారు. 'వైఎస్సార్ రైతు భరోసా - పీఎం కిసాన్' పథకం ద్వారా అర్హులైన ప్రతి రైతుకు పెట్టుబడి సాయంగా రూ.13,500 చొప్పున ఈ ఏడాది జిల్లాలో 2,19,766 మంది రైతులకు రూ.253.79 కోట్లు వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని తెలిపారు. ఆర్బీకేల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సరఫరా చేశామన్నారు. ఉద్యాన పంటల అభివృద్ధికి రూ.14.02 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఖరీఫ్‌లో 2,94,500 ఎకరాల ఆయకట్టుకు 28 టీఎంసీల సాగునీరు అందించామన్నారు. రూ.93.10 కోట్లతో సర్వేపల్లి కాలువ రిటైనింగ్ వాల్స్ నిర్మాణ పనులు, సర్వేపల్లి రిజర్వాయర్ శాశ్వత పునరుద్ధరణ పనులు చేపట్టామని, రూ.75.3 కోట్లతో జాఫర్ సాహెబ్ కాలువ గోడల నిర్మాణ పనులు 15 శాతం పూర్తి చేశామని తెలిపారు. రూ.69.9 కోట్లతో పెన్నా డెల్టాలోని మలిదేవి మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణ పనులు 50 శాతం పూర్తి చేశామన్నారు. ఆనం సంజీవరెడ్డి హైలెవల్ లిఫ్ట్ కెనాల్ (ఫేజ్-1, 2) పనుల సంబంధించి రూ.1,502.8 కోట్లతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. రూ.632 కోట్లతో ఉత్తరకాలువను 99.730 కి.మీ. మేర విస్తరించామన్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకం ద్వారా గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో డ్రోన్ సర్వే, 325 గ్రామాల్లో భూముల రీసర్వే ప్రక్రియ పూర్తి చేశామని, 234 గ్రామాల్లో భూహక్కు పత్రాలను రైతులకు అందజేశామని తెలిపారు. గ్రామ సచివాలయల్లో భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. జిల్లాలో ఇనాం, అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు యాజమాన్య హక్కులు కల్పించామన్నారు.

మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యంగా..

జిల్లాలో మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యంగా బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామం వద్ద రూ.288.89 కోట్లతో 'ఫిషింగ్ హార్బర్' నిర్మాణం పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మత్స్యకార భరోసా కింద 12,072 మంది మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.12,07,20,000 అందించినట్లు తెలిపారు.

అంగన్‌వాడీల ద్వారా..

జిల్లాలో 2,934 అంగన్‌వాడీల ద్వారా రూ.1.50 కోట్లతో 1,34,109 మంది చిన్నారులకు బాలామృతం, పాలు, గుడ్లు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్నామన్నారు.

అందరి ఆరోగ్యమే ధ్యేయంగా..

ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మొదటి విడతలో జిల్లాలో 663 వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి 2,64,871 మందికి వైద్య పరీక్షలు, చికిత్సలు అందించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకం ద్వారా అర్హులైన గర్భిణులకు ఒక్కొక్కరికి రూ.6 వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.

టంఛన్‌గా పింఛన్

జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక పథకం ద్వారా ఈ ఏడాది 23,410 మందికి కొత్త పెన్షన్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం 3,20,023 మంది పెన్షన్‌దారులకు నెలకు రూ.96.05 కోట్ల పింఛన్ నగదు ప్రతి నెలా 1వ తేదీన అందజేస్తున్నామన్నారు.

నీటి సరఫరా కోసం..

జిల్లాలోని జగనన్న కాలనీల్లో తాత్కాలిక నీటి సరఫరాకు సంబంధించి రూ.18.72 కోట్ల అంచనాలతో పనులు మంజూరు కాగా, రూ.9.49 కోట్లతో పనులు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

విద్యాభివృద్ధికి..

జిల్లాలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1,92,743 మంది విద్యార్థులకు 8 రకాల వస్తువులతో 'జగనన్న విద్యాకానుక' అందించామన్నారు. జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా 46,902 మంది విద్యార్థులకు రూ.135.79 కోట్లు, 'వసతి దీవెన' పథకం ద్వారా 48,282 మంది విద్యార్థులకు రూ.46.98 కోట్లు వారి తల్లుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. అలాగే జగనన్న అమ్మఒడి, గోరుముద్ద, విదేశీ విద్యా దీవెన, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం, నాడు-నేడు తదితర పథకాల పురోభివృద్ధి గురించి వివరించారు.

పాడి పరిశ్రమకు..

జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధి చెందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పశువుల పెంపకందారులకు 2,49,606 పశు ఆరోగ్య కార్డులు పంపిణీ చేశామన్నారు. 5,73,500 పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా అందించినట్లు తెలిపారు. గొర్రెలు, మేకలకు 14,82,126 వ్యాధి నిరోధక టీకాలు వేశామన్నారు. 640 మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాలు, పశు దాణామృతం రాయితీపై సరఫరా చేశామని తెలిపారు. పశుబీమా పథకం ద్వారా 254 మంది పాడి రైతులు, గొర్రెల కాపరులకు రూ.27,66,000 బీమా నగదు అందించినట్లు తెలిపారు.



కలెక్టరేట్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న జేసీ కూర్మనాథ్, ఇతర అధికారులు



జెడ్పీ కార్యాలయంలో జెండాకు సెల్యూట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తదితరులు



ఎస్పీ ఆఫీసులో జెండా వందనం చేస్తున్న ఎస్పీ



జిల్లా కోర్టు ఆవరణలో జెండా ఎగురవేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని

ప్రగతి మార్గంలో..

జిల్లాలో 'నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు' పథకం ద్వారా 86,122 మంది లబ్ధిదారులకు గృహాలు మంజూరైనట్లు తెలిపారు. విడవలూరు మండలం ముదివర్తిపాళెం, ముదివర్తి మధ్య పెన్నానదిపై సబ్‌మెర్జిబుల్ కాజ్‌వే నిర్మాణ పనులకు రూ.93.32 కోట్లతో ఆమోదం లభించిందన్నారు. రూ.218 కోట్లతో 544 గ్రామ సచివాలయ భవనాలు, రూ.118 కోట్లతో 541 రైతుభరోసా కేంద్రాలు, రూ.94.64 కోట్లతో 455 వైఎస్సార్ గ్రామ ఆరోగ్య కేంద్రాలు, రూ.15 కోట్లతో 86 బల్క్‌మిల్క్ సెంటర్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 316 గ్రామ సచివాలయ భవనాలు, 257 రైతుభరోసా కేంద్రాలు, 153 వైఎస్సార్ గ్రామ ఆరోగ్య కేంద్రాలు, 7 బల్క్ మిల్క్ సెంటర్ల నిర్మాణాలు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయన్నారు. జిల్లాలో ఏపీఐఐసీ పరిధిలో 7.34 ఎకరాల పారిశ్రామిక ప్లాట్లను 26 పరిశ్రమలకు కేటాయించినట్లు తెలిపారు. ఈ పరిశ్రమల ద్వారా దాదాపు 500 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు తెలిపారు. 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం ద్వారా గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 'వైఎస్సార్ వాహన మిత్ర' ద్వారా జిల్లాలో 16,516 మంది లబ్ధిదారులకు రూ.16.51 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. అలాగే జగనన్న తోడు, వైఎస్సార్ కాపునేస్తం, చేయూత, ఆసరా, బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి తదితర పథకాల అమలు గురించి వివరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీసు శాఖ పనితీరును ప్రశంసించారు. అనంతరం జిల్లాలో విశిష్ట సేవలు అందించిన వివిధ శాఖల ఉద్యోగులకు ఉత్తమ సేవా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో జేసీ కూర్మనాథ్, కమిషనర్ వికాస్‌మర్మత్, ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా, డీఆర్‌ఓ లవన్న, కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి, ఆర్డీఓ మలోల, జెడ్పీ సీఈఓ చిరంజీవి, పీడీలు సాంబశివారెడ్డి, వెంకట్రావ్, డీపీఓ సుస్మిత, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఉగ్రవాదిని మట్టుబెడుతున్న సైనికుల వేషధారణలో విద్యార్థులు



సాంస్కృతిక ప్రదర్శనతో అలరిస్తున్న విద్యార్థులు



కర్రసాము ప్రదర్శిస్తున్న విద్యార్థులు



గణతంత్ర వేడుకలను తిలకిస్తున్న జిల్లా అధికారులు

స్వేచ్ఛా జీవనానికి బాటలు

- రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): భారత రాజ్యాంగం దేశ ప్రజల స్వేచ్ఛా జీవనానికి బాటలు వేసిందని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, రాజ్యాంగ నిర్మాతల కృషి ఫలితంగానే ప్రస్తుతం మనం గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి.. నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ పొట్లూరి స్రవంతి, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజును పురస్కరించుకుని గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, దేశ ప్రజల స్వేచ్ఛ, సమానత్వానికి పెద్దపీట వేస్తూ ఎందరో మేధావులు భారత రాజ్యాంగాన్ని రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ పేర్నాటి కోటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మల్లెం సుధీర్‌కుమార్‌రెడ్డి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి రవికుమార్ పాల్గొన్నారు.



గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నేతలు

ఇళ్ల లబ్ధిదారుల సిమెంట్ పక్కదారి

- హౌసింగ్ ఏఈ కరిముల్లా నిర్వాకంపై ఫిర్యాదు

సంగం: గృహ నిర్మాణశాఖ అసిస్టెంట్ ఇంజినీర్ కరిముల్లాపై సంగం మండలంలోని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, జగనన్న ఇళ్ల లబ్ధిదారులు ఎంపీడీఓ గోపీకి ఫిర్యాదు చేశారు. వివరాలు.. సంగం-1 సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆసిఫ్ లాగిన్ ద్వారా 770 బస్తాల సిమెంట్‌కు సీఆర్‌ఓ (సిమెంట్ రిలీజింగ్ ఆర్డర్)లను, సంగం-3 సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ వినీత్ లాగిన్ ద్వారా 700 బస్తాల సిమెంట్‌కు, తరుణవాయి ఇంజినీరింగ్ అసిస్టెంట్ భవ్యశ్రీ లాగిన్ ద్వారా 170 సిమెంట్ బస్తాలకు సీఆర్‌ఓలు తీసి వాటిని గృహ లబ్ధిదారులకు ఇచ్చినట్లు గృహ నిర్మాణశాఖ రికార్డుల్లో నమోదు కావడంపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ లాగిన్ పాస్‌వర్డ్‌లు గృహ నిర్మాణశాఖ ఏఈ వద్ద ఉన్నాయని, తమకు తెలియకుండా తమ పాస్‌వర్డ్‌లు ఉపయోగించి సిమెంట్‌బస్తాలు వాడుకున్నారని, తమకు న్యాయం చేయాలని శుక్రవారం ఎంపీడీఓ ఫిర్యాదు చేశారు. జగనన్న ఇళ్లను సొంతంగా నిర్మించుకునే లబ్ధిదారుల సిమెంటు కూడా ఇవ్వకపోవడంపై లబ్ధిదారులు వాపోతున్నారు. జెండాదిబ్బ గ్రామానికి చెందిన 5 మంది లబ్ధిదారులకు 500 సిమెంటు బస్తాలు ఇవ్వకుండానే ఇచ్చారంటూ రికార్డుల్లో నమోదు చేశారు. అలాగే వంగల్లు గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు 200 బస్తాలు, అన్నారెడ్డిపాళెం గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు 200 బస్తాలు, మక్తాపురం గ్రామానికి చెందిన ఒక లబ్ధిదారునికి 60 బస్తాలు, మర్రిపాడుకు చెందిన 9 మంది లబ్ధిదారులకు 570 బస్తాలు, పెరమన గ్రామానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు 120 బస్తాలు, కొరిమెర్ల గ్రామానికి చెందిన ఒక లబ్ధిదారునికి 40 బస్తాలు ఇచ్చినట్లు రికార్డుల్లో నమోదు చేశారని, తమకు సిమెంటు బస్తాలు ఇవ్వలేదని, సీఆర్‌ఓలు తమ వద్దే ఉన్నాయని లబ్ధిదారులు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై లబ్ధిదారులు ఏఈ కరిముల్లాను ప్రశ్నించగా తన జేబులో పురుగు మందు డబ్బా ఉందని, తనను సిమెంటు అడుగుతున్న అందరి పేర్లు రాసి పురుగుమందు తాగి చచ్చిపోతానంటూ బెదిరించినట్లు లబ్ధిదారులు వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరారు. అలాగే టోల్‌ఫ్రీ నంబర్ 1902కు సైతం వారు ఫిర్యాదు చేశారు. ఎంపీడీఓ స్పందిస్తూ తగిన చర్యల కోసంపై ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు తెలిపారు.



కలెక్టర్ హరి నారాయణన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న డీపీఓ సుస్మితారెడ్డి



షాలేమ్ రాజు, జిల్లా ప్రణాళికాధికారి | నాగరాజు, పీడీ, హౌసింగ్ | రాఘవేంద్రరావు, తహసీల్దార్ | విజయ్‌కుమార్, తహసీల్దార్ | శాంతికుమారి, తహసీల్దార్ | అశోక్‌వర్ధన్, డీటీ | నిర్మలానందబాబా, తహసీల్దార్ | సాయికుమార్, సీసీ, కలెక్టరేట్ | శ్రావణ్, సీసీ, కలెక్టరేట్ | శర్వాణి, జీజీహెచ్, డీపీఎం



మురళీమోహన్, ఎంవీఐ, నెల్లూరు | పెంచలయ్య, ఏఈ, ఇరిగేషన్ | ప్రసాద్, ఐ అండ్ పీఆర్ | శోభన్‌బాబు, ఐ అండ్ పీఆర్ | కాలేషా, ఐ అండ్ పీఆర్ | వసుమతి, డీఎల్‌డీఓ | మంజుల, అటవీ శాఖ, పరిపాలనాధికారి | శర్మద, అదనపు కమిషనర్ | వెంకటరమణ, ఎంహెచ్‌ఓ, నెల్లూరు | ఎస్.మాధవి, ఎన్నికల డీటీ, కార్పొరేషన్ | సరిత, ఏసీ, డీఆర్‌డీఏ | సుజాత, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ | దేవికుమారి, సిటీ ప్లానర్

ఉత్తమ సేవలకు పురస్కారాలు

విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పురస్కారాలు అందుకున్నారు. నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో శుక్రవారం జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ ఎం.హరినారాయణన్ ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి | పెంచలయ్య, డీఎంహెచ్‌ఓ



లీలారాణి, కలెక్టరేట్ | యు.లక్ష్మి, తెలుగుగంగ | అలేఖ్య, జీసీ కార్పొరేషన్ | సురేష్‌బాబు, కలెక్టరేట్ | కోటేశ్వరరావు, డీడీ

పోలీస్ శాఖలో..

నెల్లూరు(క్రైమ్): అంకితభావంతో విధుల నిర్వహణ, ఉత్తమ సేవలందించిన పోలీసు అధికారులు, సిబ్బందికి నెల్లూరులోని పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం కలెక్టర్ ఎం.హరినారాయణన్, ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డిలు ప్రశంసాపత్రాలను అందజేశారు. నగర ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ వై.శ్రీనివాసరావు, సీసీఎస్ డీఎస్పీ డి.శివాజీ, నవాబుపేట, ఎన్నికల సెల్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌లు ఎం.బాజీ, మిద్దె నాగేశ్వరమ్మ, కె.రామకృష్ణారెడ్డి, ఆర్‌ఐ పి.పాలరాజు, కమ్యూనికేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.పద్మావతి, ముత్తుకూరు, కోవూరు, కావలి రూరల్, ఆత్మకూరు, డీసీఆర్‌బీ, సైబర్ వింగ్, డీటీసీ, ఎన్నికల సెల్, జలదంకి ఎస్సైలు ఎ.శివకృష్ణారెడ్డి, వై.రంగనాథ్‌గౌడ్, ఎస్.సుమన్, కె.ముత్యాలరావు, ఎం.కాంతికుమార్, ఎ.సురేష్‌బాబు, సీహెచ్ కృష్ణానందం, జి.సుబ్బారావు, పి.ఆదిలక్ష్మి, ఆర్‌ఎస్సైలు ఎం.తిరుమలరెడ్డి, వి.సురేష్‌బాబు, కందుకూరు, డీసీఆర్‌బీ, ముత్తుకూరు ఏఎస్సైలు ఎం.వెంకటేశ్వర్లు, డి.రమణయ్య, ఉప్పాళ్ల సుభాషిణి, ఏఆర్‌ఎస్సైలు జి.వెంకటేశ్వర్లు, ఎండీ కరిముల్లా, హెడ్ కానిస్టేబుల్స్ బి.చిరంజీవి, పి.శ్రీనివాసులు, వీబీపీఎస్ ఫణికుమార్, ఎం.కుమారస్వామి, షేక్ జిలానీ, వై.సతీష్, కానిస్టేబుల్స్ బి.కిరణ్, షేక్ అల్లాభక్షు, వై.మాల్యాద్రి, జి.మాధవరావు, పి.సుబ్బయ్య, ఎం.ప్రవీణ్ అజయ్, జి.పవన్ కుమార్, ఎం.రమణయ్య, సీహెచ్ రాజేష్, ఎం.జీవన్ మనోహర్ పాల్, ఎ.కిశోర్, సీహెచ్ కృష్ణకిశోర్, బి.వివేక్ కుమార్, ఎంవీ సురేంద్రరాజు, డీవీ రమణమ్మ, జిల్లా పోలీసు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎం.మురళీకృష్ణ సింగ్, జూనియర్ అసిస్టెంట్‌లు కె.కల్పన, ఎస్.సురేష్‌బాబు, ఫింగర్ ప్రింట్ యూనిట్ హోంగార్డులు జి.ప్రసాద్, టి.శివప్రసాద్, ఏఆర్ కానిస్టేబుల్స్ జి.సుబ్రహ్మణ్యం, షేక్ మస్తాన్‌బాషా, డి.సుమన్, వి.వెంకటేశ్‌కుమార్ ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

వలు విభాగాల్లో..

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగంలో నెల్లూరు ఏఈఎస్ ఎస్.కృష్ణకిశోర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్‌లు హెచ్‌ఎస్ హుస్సేన్‌బాషా, ఆర్.నరహరిరావు, వి.వెంకటేశ్వరరావు, ఎస్సై జి.బాలకృష్ణ, కానిస్టేబుల్ అజీజ్, బి.సురేష్, జూనియర్ అసిస్టెంట్ ఎం.గోపీనాథ్, నెల్లూరు కేంద్ర కారాగారంలో జైలర్ జి.రవిబాబు, చీఫ్ హెడ్ వార్డర్ ఎస్.సుబ్రహ్మణ్యం, వార్డర్‌లు కె.శ్రీనివాసులు, పి.రాజేంద్ర, జూనియర్ అసిస్టెంట్ పి.ముకుందప్రియ, అగ్నిమాపక శాఖలో కందుకూరు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ బి.వెంకటేశ్వర్లు, నెల్లూరు లీడింగ్ ఫైర్‌మన్ డి.హరిబాబు, ఆత్మకూరు డ్రైవర్ ఆపరేటర్ జె.అనిల్, ఫైర్‌మన్ ఇ.నాగేంద్ర, నెల్లూరు హోంగార్డు షేక్ రియాజ్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌లో ఐఎంఎఫ్‌ఎల్ డిపో ఎస్సై వి.శ్రీనివాసులు, కానిస్టేబుల్స్ వి.తులసీదాస్, పీవీ రమణయ్య, వై.ఓంకారన్, ఆ కార్యాలయం జూనియర్ సహాయకులు జి.శ్రీధర్, ఆర్.రాధికా రంజనీ ప్రశంసాపత్రాలను అందుకున్నారు.



హరినారాయణన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్, చిత్రంలో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



శ్రీనివాసరావు, డీఎస్పీ | బాజీ | నాగేశ్వరమ్మ | రామకృష్ణారెడ్డి



సుబ్బారావు | తిరుమలరెడ్డి | కుమారస్వామి | హుస్సేన్ బాషా | వివేక్ కుమార్ | రాజా

సేవా పతకాల ప్రదానం

నెల్లూరు(క్రైమ్): గతేడాది ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏఆర్ ఎస్సై మాచిరాజు సుబ్బరాజుకు ఉత్తమ సేవాపతకం, ఎస్‌బీ ఎస్సై ఎల్.రామకోటేశ్వరరావు, ఏఆర్ ఎస్సై మహ్మద్ రియాజ్, ఎస్‌బీ ఏఎస్సై మన్నేపల్లి సుబ్రహ్మణ్యం, చిన్నబజారు ఏఎస్సై గునసాని శ్రీహరి, ఇందుకూరుపేట హెచ్‌సీ బి.శ్రీనివాసులు, చిన్నబజారు కానిస్టేబుల్ సూరి ఉదయ్‌కుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వం సేవా పతకాలను ప్రకటించింది. శుక్రవారం కలెక్టర్ హరినారాయణ, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి వారికి పతకాలను అందజేశారు.



కలెక్టర్ హరినారాయణన్ చేతుల మీదుగా సేవా పతకం అందుకుంటున్న ఏఎస్సై గునసాని శ్రీహరి



రామకోటేశ్వరరావు | సుబ్రహ్మణ్యం | సుబ్బరాజు | రియాజ్ | ఉదయ్‌కుమార్

వైఎస్సార్‌సీపీ మళ్లీ గెలవడం ఖాయం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి



వెంకటాచలం: రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం కావడం ఖాయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. వెంకటాచలంలో శుక్రవారం మంత్రి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తుందని, సర్వేపల్లిలో సోమిరెడ్డి గెలుస్తాడని పగటికలలు కంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ఓటమిలో అరుదైన ట్రాక్ రికార్డు ఇప్పటికే సోమిరెడ్డి సొంతమైందన్నారు. జిల్లాలో ఆరోసారి, తన చేతిలో మూడోసారి ఓటమి పాలవడం ఖాయమన్నారు. సర్వేపల్లిలో సోమిరెడ్డి ఓడిపోతాడని ప్రతి సర్వే చెబుతోందన్నా రు. అయన ఉనికి కోసం పడరానిపాట్లు పడుతున్నాడని విమర్శించారు. కిరాయి రాజకీయాలు చేసే చంద్రమోహన్‌రెడ్డిని సర్వేపల్లి ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఆయనకు ప్రజా సేవ చేసే ఓపిక లేదన్నారు. టీడీపీ నాయకులకే కండువాలు కప్పుతూ తప్పుడు ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. నిరంతరం ప్రజల కోసం పనిచేసే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లోనూ గెలిచి అధికారంలోకి వస్తారని, తాను సర్వేపల్లిలో తిరుగులేని మెజార్టీతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలో పేదలు సాగు చేసుకునే భూములకు సంబంధించి పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు.



అటవీ శాఖ శకటం



ఎన్నికలపై అవగాహన కల్పించేలా..



గృహ నిర్మాణ శాఖ శకటం

ఆకట్టుకున్న శకటాలు

నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో శుక్రవారం జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో వివిధ శాఖల శకటాలు, స్టాల్స్ ఆకట్టుకున్నాయి. సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరిస్తూ శకటాలను ఏర్పాటు చేశారు. వీటిని ఉన్నతాధికారులు తిలకించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

172 మద్యం బాటిళ్ల స్వాధీనం



వలేటివారిపాలెం: మండల కేంద్రమైన వలేటివారిపాలెం నుంచి అంకభూపాలపురం వెళ్లే రోడ్డు మార్గంలో గురువారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు బైక్‌పై అక్రమంగా మద్యం బాటిళ్లను తీసుకెళ్తుండగా వలేటివారిపాలెం ఎస్సై మహేంద్రనాయక్ పట్టుకున్నారు. వారి నుంచి 172 మద్యం బాటిళ్లు, బైక్ స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఆయన శుక్రవారం తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 125
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 224
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 250
లేయర్ చికెన్	: 145

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.44
సన్నవి : రూ.35
పండ్లు : రూ.20

